

# ఘుట్ బాత్

ఇచ్ఛాపురపు రామచంద్రం

"అయ్యగారు రమ్మంటున్నారండి" శుభ వార్త కాస్తా చెప్పేసి వెళ్ళిపోయాడు వెంకటస్వామి.

విసుక్కుంటూ సీటులోంచి లేచాడు గోపాలం.

అతనికి ఆకలిగా వుంది.

ఆఫీసరు పిలిచాడంటే భయంగా వుంది.

జంకుతూ గడియారం చూసుకున్నాడు. లంచ్ టైముకింక పది నిముషాలే వుంది.

భోజనానికి వేళ ఔతూంటే యిప్పుడే పిలవాలా?

మధ్యాహ్నం పిలవరాదూ? ఆఫీసర్లకి ఆకలుండదు, హృదయమూ ఉండదు.

తలుపులు మెల్లగా తోసి ఆఫీసరు ముందు నిలబడ్డాడు నేరస్థుడిలా.

"ఏమిటీ డ్రాఫ్టు హెడ్డాఫీసుకి వెళ్ళే కాగితాలయినా ఒక్ట్ల దగ్గరపెట్టుకు రాయకపోతే ఎలాగ?" అలా మొదలుపెట్టి ఇరవై నిముషాలపాటు నానా చీవాట్లూ పెట్టి—ఎత్తిపొడిచి — చివరకు — "భోం చెయ్యడానికి తప్ప మరెందుకూ పనికి రా"వని సెలవిచ్చాడు లంచ్ టైములో గోపాలానివి పది నిముషాలు పైగా తినేసి.

గుండెలో అవమానం

కడుపులో ఆకలి

రెండూ మండించేస్తున్నాయి గోపాలాన్ని. ఇలా జరిగాక యింటికెళ్ళి అన్నం తిని వచ్చి—లేటయినందుకు మళ్ళీ చీవాట్లు తినవలసివస్తుందని—ఇంటికెళ్ళే ఆలోచన మాని (ఆఫీసరు పుణ్యమా అని)హోటలు వేపు నడవసాగాడు.

ఎండ మండిపోతూంది

గోపాలం గుండె మండిపోతూంది.

తన పుణ్యకాలం (లంచ్ టైము)లో అన్యాయంగా పది నిముషాలు తినేసిన ఆఫీసరుమీద స్వగతంలో శాపాలు విసురుతూ మహాచెడ్డ ఆకలిగా హోటల్లోకి వచ్చి భోజనం టికెట్టు (ఫుల్ మీల్) కొనుక్కుని కుర్చీలో కూలబడ్డాడు నీరసంగా, నిస్ప్రాణగా.

చద్దన్నం తిన్నమ్మకి మొగుడాకలి తెలియదట. సర్వర్‌కి గోపాలం ఆకలెలా తెలుస్తుంది?

తాపీగా ఆకువేసి—నీళ్లు పెట్టాడు. ఆ సర్వరేశ్వరుడిది నిదానమే ప్రధానమన్న ప్రిన్సిపల్‌లా ఉంది. ఓ పది నిముషాలు తీసుకుని అన్నీ వడ్డించి—అప్పుడు తీసుకువచ్చాడు అన్నం.

అంతవరకూ గోపాలం ఎలా నిగ్రహించుకున్నాడో అతనికే తెలియదు. సర్వరు అన్నం కప్పు ఆకులో బోర్లించడమే తడవు ఆత్రుతగా దండయాత్ర



"ఒద్దు బాబూ నా మాట విని తిరిగిపో. ఏం లాభం లేదు. మధ్యాహ్నమే ఇన్కం టాక్స్ వాళ్ళొచ్చి పోయారు."

ప్రారంభించాడు.

ఆకలి రుచి ఎరుగదన్నది-అతని విషయంలో ఓడిపోయింది. గోపాలానికి—

అన్నం—అధ్వాన్నంగా ఉంది.

పప్పు—ఉప్పు నిండిపోయింది.

సాంబారు—బోరుగా ఉంది.

రసం—నీరసంగా ఉంది.

పచ్చడి—చప్పగా ఉంది.

కూర—ఘోరంగా క్రూరంగా ఉంది.

సర్‌ప్రయిస్ విజిట్‌కి వచ్చిన ఆఫీసరుకి—ఒక్క గుమాస్తా కూడా పని చెయ్యకుండా కనిపిస్తే ఎంత కోపం వస్తుందో గోపాలానికి ఆకులోని అన్ని పదార్థాలమీదా అంత కోపమూ వచ్చింది.

కాని—

ఆ పదార్థాలు — నిర్జీవాలు.

"సర్వర్ —" కసిగా కేక వేశాడు.

తన ధోరణి తనదే అన్నట్లు నిదానంగా నిముషం నడచివచ్చాడు సర్వర్.

"ఏమిటీ తిండి? తినమనా, తగలెయ్యమనా?" అరిచాడు గోపాలం.

ఆకలి—కోపాన్ని పదమూడు పెట్టి హెచ్చవేసేస్తుంది.

"నేను సప్లయర్ని. మీ సగభాగాన్ని కాను. ఇది—హోటలు. మీ ఇల్లు కాదు. కనుక—మీరలా గొంతుచించుకోడం పద్ధతికీ. సభ్యతకీ కూడా విరుద్ధం. వడ్డించడం వరకే నా డ్యూటీ. అది నేను సరిగానే నిర్వర్తించాను. తినడం మీ విధి. అది మీరు నెరవేర్చలేకపోతే నేను చేయగలిగేదేమీలేదు. మీ టికెట్ నంబరు రెండు వందల పదహారు. మీరు కంప్లయింట్ చేయదలచుకుంటే—చెయ్యి కడుక్కుని మానేజర్ని కలుసుకోండి."

హుంకరించి—ఆకు మడిచేసి — లేచి పోయాడు గోపాలం.

పేదవానికోపం పెదవికి చేటు.

హోటలుమీద కోపం హంగర్‌కి చేటు.

గోపాలం ఆకలి తీవ్రస్థాయినందుకుంది. ఆకలినీ, అవమానాన్నీ భరించడం ఎవరి తరం?

అవసరమయితే శుంపు చీటి గీకి పారెయ్యొచ్చులే అనుకుని యింటికి నడిచాడు.

ఆకలి. ఆకలి. ఆకలి.

కోపంగా తలుపు తట్టాడు.

విసుక్కుంటూ—"ఎవరు?" అంటూ కేకవేసింది శ్రీమతి.

"నేనే." అరిచాడు గోపాలం.

"నేనంటే?"




"నేనంటే — గోపాలాన్ని. నీ మొగుణ్ణి."

విమల తలుపు తీసింది.

"ముందు అన్నం పెట్టు. కడుపు మండిపోతూంది."

తెల్లబోయి — "ఇంతవరకూ మీరు రాకపోతే యిక రారేమో అనుకుని పని మనిషికి వేసేశాను. చద్దెన్నం ఉన్నట్లుంది. చూసొస్తా" అందామె.

విసురుగా ఆమె చెయ్యందుకుని — "నాకు చద్దెన్నం పెడతావా!" అని గర్జించాడు గోపాలం కీ. శే. వేమూరి గగ్గయ్యలా.

"మరేం చెయ్యమంటారు? మీ ఆకలి నాకు తెలుసు ఇప్పుడు బియ్యం పడేసినా ఉడికేవరకూ ఆగలేరు."

"మొగుడికి — కట్టుకున్న మొగుడికి వేడన్నం పెట్టాలన్న వివేకమేనా లేకపోయిందన్న మాట నీకు!"

"వేళాపాళా లేకుండా వచ్చేవాళ్ళకి వేడివేడిగా వడ్డించగలగడానికి కిది యిల్లా? హోటలా? నేను యిల్లాల్ని. హోటలు వాణ్ని కాను. పోనీ, హోటల్లోనే తిని రాలేకపోయారా యీ పూటకి?"

గోపాలం అవాక్కయిపోయాడు.

తనకి తెలియకుండానే విమల చెయ్యి వదిలేశాడు.

విమల వంటింట్లోకి వెళ్ళిపోయింది.

హోటలువాడు ఇంటికి పొమ్మన్నాడు.

ఇల్లాలు హోటలుకి పొమ్మంటూంది.

అటు హోటలు

ఇటు ఇల్లు

రెండిటికీ మధ్య తనో ఫుట్‌బాల్.

అసలు — మగవాడికి అధికారమూ, స్వేచ్ఛా ఎక్కడున్నాయ్?

ఈ ప్రపంచం అనే గ్రౌండులో మగవాడు వొట్టి ఫుట్‌బాల్ మాత్రమే.

"సరే. ఆ చద్దెన్నమే తగలెయ్ నా మొహానికి." అంటూ వంటింట్లోకి నడిచాడు గోపాలం

పాపం, గోపాలం!

★